క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో చేరిక



జగ్గయ్యపేట అర్బన్:మండలంలోని బూదవాడ గ్రామానికి చెందిన గంగుల శ్రీనివాస్ టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నివాసంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ సమక్షంలో చేరిన శ్రీనివాస్‌కు ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

నేడు మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

జగ్గయ్యపేట అర్బన్ :పేట మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సోమవారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్‌హాల్లో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశంలో పట్టణంలోని పలు అభివృద్ధి పనులు, పరిపాలనకు సంబంధించిన కేటాయింపులు తదితర 25 అంశాలతో కూడిన ఎజెండాను కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం సిద్ధం చేసినట్లు చెప్పారు. గౌరవ కౌన్సిల్ సభ్యులు, ఎక్స్‌-అఫిషియో మెంబర్లు హాజరు కావాలని కోరారు.

ఘనంగా రాధాకృష్ణుల విగ్రహ ప్రతిష్ట

నందిగామ: మండలంలోని అంబారుపేట గ్రామంలో గల బోధానంద స్వామి వారి ఆశ్రమంలో సోమవారం రాధాకృష్ణుల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల హోమాలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

కోతుల బెడద తప్పించుకునేందుకు సోలార్ కంచెలు



పెనుగంచిప్రోలు:గ్రామాల్లో కోతుల నుంచి రక్షించుకునేందుకు ఖర్చు ఎక్కువయినా పలు గృహ యజమానులు సోలార్ కంచెలు ఏర్పాటు చేసుకుంటున్నారు. పెద్ద సంఖ్యలో ఉన్న కోతులు పెద్దలు, పిల్లలు అనే తేడా లేకుండా వెంట పడటం, గాయపరచటం, ఇళ్లల్లోకి దూరి గందరగోళం సృష్టిస్తున్నాయి. రూ.లక్ష ఖర్చు పెట్టి అయినా సోరాల్ కంచెలు ఏర్పాటు చేస్తున్నట్లు అంటున్నారు.

సమస్యల పరిష్కారం కోసమే స్పందన



నందిగామ:సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ రవీంద్రరావు సూచించారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 6 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా స్పందన నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కంచికచర్ల: స్పందన కార్యక్రమంలో ఐదు అర్జీలు అందినట్లు తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి సోమవారం తెలిపారు. పలు గ్రామాల నుంచి సమస్యలు పరిష్కారం కోరుతూ ఐదు అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు. వాటిలో వేములపల్లిలో గ్రామ సచివాలయం కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ సక్రమంగా విధులు నిర్వర్తించటంలేదని 1, ఇంటి స్థలం కావాలని 1, భూములకు సంబంధించిన సర్వే చేయాలని మూడు అర్జీలు వచ్చాయన్నారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపించి ప్రాధాన్యతాక్రమంలో త్వరతగతిన పరిష్కరిస్తామని చెప్పారు.

క్రీడా దుస్తులు పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని శ్రీమతి గెంటేల శకుంతలమ్మ (ఎస్‌జీఎస్) కళాశాలలో నిర్వహించే సామినేని వెంకట మల్లికార్జున ప్రసాద్ మెమోరియల్ రాష్ట్ర స్థాయి మహిళల కబడ్డీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు క్రీడా దుస్తులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అందజేశారు. ఎస్‌జీఎస్ కళాశాలలోని క్రీడామైదానంలో వేదిక వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 13 జిల్లాల నుంచి వచ్చిన పలువురు క్రీడాకారులు, కోచ్‌లకు ఎమ్మెల్యే ఉదయభాను దుస్తులు పంపిణీ చేశారు. టోర్నమెంట్ ఇన్‌చార్జ్ గంటా వెంకటేశ్వర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో అభివృద్ధి పరుగులు

- రూ.30 కోట్లతో పట్టణంలో పనులు
- రహదారులు, డ్రెయిన్లు నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



నందిగామ పట్టణంలో ఆధునిక హంగులతో నిర్మించిన సీఎం రోడ్డు

నందిగామ: పట్టణంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేసి పట్టణ రూపురేఖలు మార్చుతున్నారు. దీంతో పట్టణ ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రహదారులు, డ్రెయిన్లు, సిమెంటు రోడ్లు నిర్మిస్తున్నారు. నందిగామ వ్యాపార కూడలి కావడంతో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా గతంలో పాలకులు పట్టణాన్ని అభివృద్ధి చేయలేదు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత పట్టణాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేస్తున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్‌కుమార్‌లు ఒక ప్రణాళికాబద్ధంగా నందిగామపై అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులు చేయిస్తున్నారు.

నవ నందిగామ దిశగా....

నవ నందిగామ దిశగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే దాదాపు రూ.30 కోట్లు వెచ్చించి పనులు మొదలుపెట్టారు. రహదారులు, డ్రెయిన్ల వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ప్రధాన రహదారుల్లో ఒకటైన సీఎం రోడ్డు రూ.1.2 కోట్లతో అభివృద్ధి చేశారు. రూ.10 కోట్లతో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. రూ.4 కోట్లతో సిమెంట్ రోడ్లు నిర్మించారు. అతి త్వరలో పట్టణంలోని చందర్లపాడు రోడ్డు, రామన్నపేట రోడ్డు, మెయిన్ రోడ్డు, గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డు, కోర్టు రోడ్లను అభివృద్ధి చేసేందుకు పనులు ప్రారంభమయ్యాయి. వంద పడకల ఆసుపత్రిని కూడా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విమర్శలు లెక్కచేయకుండా స్థానికులకు అర్థమయ్యే విధంగా చెప్పి ఒప్పించి ప్రధాన రహదారిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ రహదారి పట్టణంలోని ప్రధాన వ్యాపార కూడలికి పోటీగా మారింది. అదేవిధంగా పట్టణంలోని పలు ప్రధాన రహదారుల రూపురేఖలు కూడా త్వరలోనే మారనున్నాయి.

అన్ని రోడ్లు బాగు చేయాలి



పట్టణంలోని సీఎం రోడ్డు అభివృద్ధి చెందిన తర్వాత చాలా బాగుంది. గతంలో ఈ రహదారిలో మేము ట్రాఫిక్‌తో ఇబ్బంది పడేవాళ్లం. ప్రస్తుతం చాలా విశాలంగా మార్చారు. పట్టణంలోని అన్ని ప్రధాన రహదారులు అభివృద్ధి చేయడం వలన పట్టణం కూడా బాగుంటుంది.

–ఎస్‌ఎం సుభాని, విశ్రాంత ఉపాధ్యాయుడు

అభివృద్ధే లక్ష్యం



నందిగామ పట్టణాన్ని అభివృద్ధి చేయాలన్నదే మా లక్ష్యం. నివసించే జనాభాకు అనుగుణంగా ఇప్పటివరకు పట్టణాభివృద్ధి జరగలేదు. ఈ తరుణంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేస్తున్నాం. మాకు రాజకీయాలు ముఖ్యం కాదు. నందిగామ అభివృద్ధే ముఖ్యం.

–డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్, ఎమ్మెల్సీ

ప్రజల సహకారంతోనే



పట్టణంలోని అన్ని ప్రధాన రహదారులు అభివృద్ధి చేస్తున్నాం. ఇప్పటికే సీఎం రోడ్డు అభివృద్ధి చేశాం. మిగిలిన ప్రధాన రహదారులు కూడా పట్టణ ప్రజల సహకారంతోనే అభివృద్ధి చేస్తున్నాం. డ్రైనేజీ వ్యవస్థ కూడా మెరుగుపరుస్తున్నాం.

–డాక్టర్ జయరాం, కమిషనర్ నగర పంచాయతీ

మహిళా సాధికారతే ముఖ్యమంత్రి ధ్యేయం

రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత



సామూహిక సీమంతాల కార్యక్రమంలో హోం మంత్రి తానేటి వనిత, విమలాభాను

జగ్గయ్యపేట:మహిళా సాధికారతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని రాష్ట్ర హోంశాఖామంత్రి తానేటి వనిత తెలిపారు. పట్టణంలో సామినేని విమలాభాను ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి మహిళలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హోం మంత్రి వనిత మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో మహిళా శిశు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రాష్ట్ర బడ్జెట్‌లో ఏటా రూ.500 కోట్లు కేటాయిస్తున్నారని చెప్పారు. గర్భిణుల కోసం ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసి వారికి పోషకాహారంపై అవగాహన కల్పించటం అభినందనీయమని పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం ఎన్నో చట్టాలను తెచ్చి దేశంలోనే ఆదర్శంగా నిలిచారన్నారు. ఫౌండేషన్ చైర్‌పర్సన్ సామినేని విమలాభాను, మున్సిపల్ వైస్‌చైర్ పర్సన్ హఫీజున్నీసా, పట్టణ వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు మునిని రాజ్యలక్ష్మీ, పెనుగంచిప్రోలు సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మునిహేరా, ఐసీడీఎస్ సీడీపీఓ గ్లోరి, మహిళా కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నాడు–నేడు దేశానికే ఆదర్శం



పనులను పరిశీలిస్తున్న సామినేని వెంకట కృష్ణ ప్రసాద్

వేదాద్రి(జగ్గయ్యపేట):ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నాడు–నేడు పథకం దేశానికే ఆదర్శమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు, కౌన్సిలర్ సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ తెలిపారు. గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో నాడు–నేడు పనులను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లు అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. విద్యారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక పథకాలు ప్రవేశపెట్టి నిరుపేద విద్యార్థుల తల్లిదండ్రులకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. పనుల్లో కాంట్రాక్టర్‌లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. సర్పంచ్ గుడారు పేరయ్య, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాలకు బహిరంగ వేలం

నందిగామ: వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాల యజమానులు వెంటనే సంబంధిత బకాయి చెల్లించకపోతే ఆ వాహనాలను బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆర్టీవో పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నందిగామ రవాణా శాఖ అధికారులు సీజ్ చేసిన పలు ద్విచక్ర వాహనాలు, ఆటోలను వెంటనే సంబంధిత యజమానులు ప్రభుత్వానికి కట్టాల్సిన బకాయి ఫీజు చెల్లించి తీసుకువెళ్లాలని కోరారు. లేదంటే మార్చి 15వ తేదీన ఆ వాహనాలను బహిరంగ వేలం వేస్తామన్నారు.

పారిశుద్ధ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలి

కమిషనర్ డాక్టర్ జయరాం



డ్రైనేజీను పరిశీలిస్తున్న కమిషనర్

నందిగామ:పట్టణవాసులు ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పారిశుద్ధ్య సిబ్బంది వచ్చిన సమయంలో మాత్రమే చెత్తను అందజేయాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. పట్టణ పరిధిలోని హనుమంతుపాలెంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముఖ్యంగా డ్రైనేజీలలో వ్యర్థాలు వేయడం వలన పారిశుద్ధ్య సమస్య ఏర్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. పట్టణ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ జరుగుతోందని ప్రజలందరి సహకారంతో పారిశుద్ధ్యం మరింత మెరుగుపర్చాలని సూచించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ గురునాథం తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా ఆరోగ్య ప్రగతి: డీఎంహెచ్‌ఓ

లబ్బీపేట(విజయవాడతూర్పు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలు లక్ష్యాలకు అనుగుణంగా ప్రగతి సాధించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. తన కార్యాలయంలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నాన్ కమ్యూనికల్ వ్యాధులు, సాంక్రమిక వ్యాధులు, ఆరోగ్యశ్రీ లబ్ధిదారులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత ఫీడ్ బ్యాక్ సమరీపై సమీక్షించారు.

జక్కంపూడిలో మహిళపై చాకుతో దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన భర్తతో చనువుగా ఉన్న మహిళపై వివాహిత చాకుతో దాడి చేసి గాయపరిచిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి కాలనీ బ్లాక్ నెం 169వ నెంబర్ బ్లాక్‌కు చెందిన పెద్దప్రాలు సలోమి, భాస్కర్ భార్యభర్తలు. సలోమి భర్తతో విభేదాల కారణంగా ఒంటరిగా ఉంటోంది. సలోమి నివసించే బ్లాక్‌లోనే ఇరుగు రాజా, దీనకుమారి నివసిస్తున్నారు. సలోమి కొంత కాలంగా రాజాతో చనువుగా ఉంటోంది. సోమవారం ఉదయం రాజా సలోమి ఇంటిలో ఉండగా, దీనకుమారి అక్కడకు చేరుకుంది. దీంతో సలోమి, దీనకుమారిల మధ్య వివాదం చోటు చేసుకోవడంతో దీనకుమారి చాకుతో దాడి చేసింది. దీంతో సలోమికి మెడ కింద భాగంలోనూ, ఎడమ చేతి కింద తీవ్ర గాయంతో కావడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

పాలనా సౌలభ్యం కోసమే మండల కేంద్రంగా జుజ్జూరు

మండల కేంద్రం మార్పు తీర్మానానికి ఆమోదం



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి

వీరులపాడు:పరిపాలనా సౌలభ్యం నిమిత్తం వీరులపాడు మండల కేంద్రాన్ని జుజ్జూరుకు మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి మెజార్టీ సభ్యులు ఆమోదం తెలపటం అభినందనీయమని ఎంపీపీ కోటేరు లక్ష్మి తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జుజ్జూరును మండల కేంద్రంగా మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఎంపీడీవో అరుంధతీ దేవి సర్వసభ్య సమావేశంలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని ఎంపీటీసీ సభ్యులు ఓటింగ్ ద్వారా తమ ఆమోదాన్ని తెలపాలని కోరటంతో ఎనిమిది మంది సభ్యులు ఆమోదం తెలిపారు. వీరులపాడు ఎంపీటీసీ సభ్యుడు మందూరి ప్రకాశరావు వీరులపాడునే మండల కేంద్రంగా కొనసాగించాలని తన నిర్ణయాన్ని తెలిపారు. 14 మందికి గాను తొమ్మిది మంది ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి హాజరవగా ఎనిమిది ఆమోదం తెలపటంతో తీర్మానాన్ని ఆమోదించినట్లు ఎంపీడీవో తెలిపారు. అనంతరం సభ్యులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. మండల కేంద్రం మార్పునకు కృషి చేసిన శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్‌లకు ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు..

వేసవి కాలం సమీపిస్తున్నదని గ్రామాలలో తాగునీటి ఎద్దడి సమస్యలు లేకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98 శాతం మేర అమలు చేసిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు కీర్తి సౌజన్య కొనియాడారు. జలజీవన్ మిషన్ ద్వారా మండలానికి రూ. 20 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీలక్ష్మీ వెల్లడించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ఏడాది 8500 మంది జాబ్‌కార్డు కలిగిన వారికి పని దినాలు కల్పించి రూ.8.89 కోట్లు అందించినట్లు ఏపీవో జనార్ధన్ తెలిపారు. జలకళ పథకం ద్వారా రైతుల సాగు భూముల్లో 442 బోర్లు ఏర్పాటు చేశామని వీరులపాడు మండలం రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. మండలంలో 854 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయని వాటిలో 376 గృహాలు నిర్మాణాలు పూర్తయ్యాయని హౌసింగ్ ఏఈ సాయి చెప్పారు. ఎంపీటీసీ సభ్యులు శీలం రమణారెడ్డి, తోట నారాయణరావు, యాదాల సుజాత, వేమిరెడ్డి కోటేశ్వరీ, షేక్ నాగుల్‌మీరా, వేమూరి ఆదాం, మొండ్రు బాయమ్మ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రామకోటి మహోత్సవాలు ప్రారంభం



గోదారంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చక స్వామి

నందిగామ:పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి వారి ఆలయంలో 70వ రామకోటి మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలను భువనేశ్వరి పీఠాధిపతులు కమలానంద భారతి స్వామి ప్రారంభించారు. అనంతరం గోదా రంగనాథ స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహకారం

వీరులపాడు:వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యులుగా ఉండి మృతి చెందిన బాధిత కుటుంబాలకు సంఘం అండగా ఉంటుందని సొసైటీ చైర్మన్ జంగా కోటిరెడ్డి, సర్పంచ్ మారపాక మహాలక్ష్మీ తెలిపారు. మండలంలోని జయంతి గ్రామానికి చెందిన తమ్మిశెట్టి వరలక్ష్మీ ఇటీవల మృతి చెందగా మట్టి ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ. 10 వేలను సోమవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణరెడ్డి, సచివాలయ సిబ్బంది, పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఈకేవైసీ నమోదు

వీరులపాడు:రబీలో సాగు చేసిన పంటలకు రైతులు విధిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏవో జోగేంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక ఏవో కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ 2022–23కు ఈక్రాప్‌లో పంటలను నమోదు చేయించుకుని ఈకెవైసీ చేయించుకోవాలన్నారు. ఈ నెల 28 వరకు మాత్రమే గడువుందని ఈలోగా రైతులు ఈకెవైసీ చేయించుకోవాలని సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద రక్షణ బాక్స్‌లు ఏర్పాటు



స్తంభాల వద్ద ఏర్పాటు చేస్తున్న బాక్స్‌లు

పెనుగంచిప్రోలు:మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద ఫీజులు, వైర్లు తగిలి ప్రమాదం సంభవించకుండా ఉండేందుకు ప్రత్యేకంగా బాక్స్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బాక్స్‌ల ఏర్పాటుతో విద్యుత్ ప్రమాదాలు చాలా తగ్గుతాయని చెప్పారు. పెనుగంచిప్రోలు పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి చెరువుకట్ట వరకు, బైపాస్ రోడ్‌లో ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించి పెద్ద స్తంభాలు ఏర్పాటు చేయటంతో పాటు రోడ్డు పక్కకు వేస్తామని పేర్కొన్నారు. దీంతో వాహనదారులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. పెనుగంచిప్రోలు నుంచి అనిగండ్లపాడు వరకు అమ్మవారి పసుపు–కుంకుమ బండ్లు వచ్చే దారిలో 45 ఎత్తు స్తంభాలు పెట్టామన్నారు. మండలంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం మొత్తం 387 దరఖాస్తులు రాగా ప్రస్తుతం 150 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వరి పంట పూర్తి అయితే అవి కూడా పూర్తి చేస్తామన్నారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సహకరించాలని కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు



నందిగామ: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తీసుకుంటామని ఎస్ హెచ్ ఓ సతీష్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న పలువురిని సోమవారం రాత్రి నందిగామ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ హెచ్ ఓ మాట్లాడుతూ ఫిర్యాదుల నేపథ్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎస్ఐ పండు దొర, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనర్థాలు

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరించి, విష సంస్కృతికి దూరంగా ఉండేలా విద్యార్థుల్లో చైతన్యం పెంచాలని కలెక్టర్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. ఇటీవల విభిన్న ప్రతిభావంతులకు నిర్వహించిన ఆటల పోటీల్లో సేవలందించిన కానూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు సోమవారం కలెక్టర్ ఢిల్లీరావు ఆయన కార్యాలయంలో ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంకేతిక విజ్ఞానాన్ని కొందరు విద్యార్థులు చెడు వ్యసనాలకు ఉపయోగిస్తూ భవిష్యత్‌ను పాడుచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్, విద్య, వైద్య ఆరోగ్య, మహిళాభివృద్ధి, సాంఘిక సంక్షేమం తదితర శాఖల అధికారుల సమన్వయంతో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించి మత్తుపదార్థాల వినియోగాన్ని అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రీతి ఘటనలో నిందితుల్ని శిక్షించాలి

ఏఐఎస్‌ఎఫ్, ఏపీ మహిళా సమాఖ్య

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తెలంగాణలో ర్యాగింగ్ భూతానికి బలై ఆత్మహత్యకు పాల్పడి మరణించిన వైద్య విద్యార్థి ఘటనలో దర్యాప్తు జరిపి నిందితుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్‌ఎఫ్), ఏపీ మహిళా సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం స్థానిక లెనిన్ కూడలి వద్ద కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. డాక్టర్ ప్రీతికి నివాళులర్పించారు. ప్రీతి ఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి నిందితుల్ని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు మందగళ్ళ సాయికుమార్, మహిళా సమాఖ్య నగర ప్రధాన కార్యదర్శి పంచ దార్ల దుర్గాంబ, శ్రామిక మహిళా ఫోరమ్ కార్యదర్శి శైలజ మాట్లాడారు. కార్యక్రమంలో విద్యార్థి , మహిళా సమాఖ్యల నాయకులు మోతుకూరి అభ్యుదయ, అయ్యప్ప, ఓర్సు భారతి, దుర్గాసి రమణమ్మ, తమ్మిన దుర్గాంబ, డి.సీతారావమ్మ, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.